క్లుప్తంగా

మైసమ్మ ఆలయంలో జన జాతర



నవాబుపేట: మండలంలోని పర్వాతాపూర్ మైసమ్మ దేవాలయం ఆవరణలో జన జాతర కొనసాగింది. ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు అడవిలో వెలసిన మైసమ్మ తల్లిని దర్శించి అమ్మవారికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించారు. అడవి మొత్తం అమ్మవారి నామస్మరణతో మార్మోగింది. ఆదివారం మైసమ్మ దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారిని ప్రత్యేక అలంకరణలో పూజారులు భక్తులకు దర్శనం ఇప్పించారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత



హన్వాడ: ప్రతి నిత్యం ధ్యానం చేయడం ద్వారా మానసిక ప్రశాంతత కలుగుతుందని సీనియర్ పిరమిడ్ మాస్టర్ మాధవరావు అన్నారు. ఆదివారం మండలంలోని దాచక్‌పల్లిలో ఏర్పాటు చేసిన ధ్యాన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ధ్యానంతో ఒత్తిళ్లను జయించవచ్చన్నారు. అందరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని కోరారు. మాంసాహారం మాని, రోజు వారి ఆహారంలో శాఖాహారం తీసుకోవాలని సూచించారు. శాకాహారంతో సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారని తెలిపారు. ధ్యానం వల్ల కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో మాస్టర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

40వ వారం అన్నదానం

నవాబుపేట: సంతకు వచ్చే వారికి ఉచిత భోజనం అందిస్తున్న కార్యక్రమం ఆదివారంతో 40వ వారానికి చేరుకుంది. దీంతో ప్రతి ఆదివారం సంతకు వచ్చే వారికి భోజనం అందించే కార్యక్రమంతో గ్రామాల ప్రజలు భోజనం చేస్తున్నారు. సంతకు వచ్చే వివిధ గ్రామాల ప్రజలకు ఆదివారం మధ్యాహ్నం ఉచిత భోజన కార్యక్రమాన్ని మండల కేంద్రానికి చెందిన మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహచారి ఏర్పాటు చేస్తున్నారు. అన్నదాన కార్యక్రమంలో వ్యాపార సంఘం మండల అధ్యక్షుడు సుధాకర్‌చారి, పుట్టి అంజనేయులు, నిరంజన్, బబ్లు, నసీర్, చందు, వెంకటయ్య, రఘు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులను గౌరవించాలి

జడ్చర్ల టౌన్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్స వేడుకల్లో ఉద్యమకారులను గౌరవించాల్సిన అవసరం ఉందని పెద్ద ఆదిరాలకు చెందిన దానం హరిబాబు నేతృత్వంలో తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం వినతిపత్రం సమర్పించారు. ఉద్యమంలో పాల్గొన్న వారికి 250 గజాల స్థలం కేటాయించాలని, తద్వారా తనలాంటి ఉద్యమకారులందరికి సముచిత స్థానం దక్కినట్లవుతుందన్నారు. ఉద్యోగులకు పదోన్నతులు, కోరుకున్న ప్రాంతానికి బదిలీ చేయాలన్నారు. కార్యక్రమంలో కావలి రమేష్, బాల్‌రాజు, యాదయ్యలు పాల్గొన్నారు.

హెల్పింగ్ హ్యాండ్స్ చేయూత

జడ్చర్ల టౌన్: మండలంలోని గంగాపురం గ్రామంలో హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగులు, పెన్నులు, ప్యాడ్లు, వాటర్ బాటిళ్లను అందజేశారు. గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 'పదిలో ఉత్తమ ఫలితాలు సాధించిన వారిని ప్రోత్సహించటం వల్ల భవిష్యత్‌లో విద్యార్థుల్లో పోటీతత్వం ఏర్పడుతుందని సంస్థ సభ్యులు తెలిపారు. సంస్థ సభ్యత్వం తీసుకున్న యువకులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. భవిష్యత్‌లో చేపట్టబోయే సేవా కార్యక్రమాల్లో తమ వంతు భాగస్వామ్యం అందిస్తామని నూతన సభ్యులు ప్రకటించారు.

'గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి'

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: గుర్తింపు లేని పాఠశాలలపై తగు చర్యలు తీసుకోవాలని గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శోభన్‌బాబు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎలాంటి అనుమతి లేకుండా వందలాది ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు నడుస్తున్నాయని ఆరోపించారు. పాఠశాలల నిర్వాహకులు సాధారణ అనుమతి పొంది ఏకంగా ఇంటర్నేషనల్, టెక్నో, కాన్సెప్ట్ అనే రకరకాల ట్యాగులు తగిలించి తల్లిదండ్రుల నుంచి ఎక్కువ ఫీజులు వసూలు చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు రవి, నరేష్, షెబాజ్, కృష్ణ పాల్గొన్నారు.

రోడ్లపైనే వరిధాన్యం మొలకలు



పోలేపల్లి సెజ్‌రోడ్లపై మొలకెత్తిన వరిధాన్యం చూపుతున్న రైతులు

- కొనుగోలు చేయక రైతుల ఆందోళన
- వర్షానికి తడుస్తున్న ధాన్యం కుప్పలు
- పడిగాపులు కాస్తున్న రైతులు

రాజాపూర్: ఆరుగాలం శ్రమించి పండించిన పంటను ప్రభుత్వం కేంద్రాల ద్వారా కొనుగోలు చేయకపోవడంతో వర్షాలకు రోడ్లపైనే ఉన్న వరిధాన్యం కుప్పలు తడుస్తూ మొలకెత్తుతోంది. రాజాపూర్ మండలం రాయపల్లి, ముదిరెడ్డిపల్లి, చెన్నవెల్లి, జడ్చర్ల మండలం పోలేపల్లి గ్రామాలలో రైతులు పడించిన వరిధాన్యం ఆరబెట్టేందుకు సమీపంలో ఉన్న పోలేపల్లి శివారులోని సెజ్‌లోని రోడ్లపై కుప్పలుగా పోసుకున్నారు. అయితే వర్షాల కారణంగా రైతులు తాము క్రాప్‌కటింగ్ చేసి ఆరబెట్టేందుకు రోడ్లపై కుప్పలు పోసినప్పటి నుంచి వర్షం కురుస్తుండటంతో ఆరబెట్టేందుకు వీలుకాలేదు. రాయపల్లి, ముదిరెడ్డిపల్లి గ్రామాలకు చెందిన 16 మంది రైతులు సుమారు 550 క్వింటాళ్ల ధాన్యం అలాగే రోడ్లపై కొనుగోలు చేయకపోవడంతో ధాన్యంకుప్పల్లో మొలకలు వస్తున్నాయి. ధాన్యం కళ్లముందే పాడైపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జడ్చర్ల మండలం పోలేపల్లికి చెందిన 26 మంది రైతులు సెజ్‌లోని రోడ్లపైనే వరిధాన్యం 750 క్వింటాళ్ల వరకు కుప్పలు అలాగే ఉన్నాయి. పోలేపల్లి గ్రామంలో ఈసంవత్సరం మ్యాన్‌పవర్ లేదనే సాకుతో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయలేదు. దీంతో వ్యవసాయశాఖ అధికారులు మాత్రం రైతులు తాము పండించిన పంటను గంగాపూర్ గ్రామశివారులోని పత్తిమార్కెట్ తీసుకురావాలని చెబుతుండటంతో రైతులు ఏమి చేయాలో తోచక రోడ్డుపైనే ధాన్యం రాసులను కవర్‌లు కప్పి ఉంచారు. తేమశాతం ఎక్కువ ఉందని కేంద్రాల నిర్వాహకులు ధాన్యం కొనుగోలు చేయడం లేదని రైతులు పేర్కొంటున్నారు.



వరికుప్పలవద్ద ధాన్యం నారుగా రావడంతో చూస్తూ బాధపడుతున్న రైతులు

ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలి



సర్కార్ కొనుగోలు కేంద్రాల వారు త్వరగా తమ వరిధాన్యాన్ని కొనుగోలు చేయాలి. చాలా రోజుల నుంచి రోడ్లపైనే వరిధాన్యం కుప్పల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది. వర్షానికి ధాన్యం అంత మొలకెత్తుతోంది. మా బాధలు ఎవరూ పట్టించుకోవడంలేదు. మొన్న సారోళ్లు వచ్చి తేమశాతం తక్కువ ఉంటేనే కొనుగోలు చేస్తామన్నారు. అన్ని విధాల రైతులమే నష్టపోతున్నాం. మా బాధలు అర్థం చేసుకొని కొనుగోలు చేయాలి.

– సుమతమ్మ, రైతు, రాయపల్లి

మిల్లుకాడికి పోతే లోడ్ దించుకుంటలేరు..



కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మిన తర్వాత సర్కార్ వారు పలానా మిల్లుకు పోయి అన్‌లోడ్ చేసిరండి అంటున్నారు. ఆ మిల్లు దగ్గరికి లోడ్ చేసుకుని వెళ్తే వాళ్లు బండ్లను ఖాళీ చేసుకుంటలేరు. రాజాపూర్ మండలం నుంచి గంగాపూర్ శివారులో ఉన్న మిల్లువద్దకు వెళ్తే మూడురోజులైనా బండి అన్‌లోడ్ చేసుకోకపోతే మళ్లీ బండి ఇంటికి తెచ్చుకోవాల్సివచ్చింది. కొందరు మిల్లువారైతే క్వింటాలుకు రెండు నుంచి మూడు, నాలుగు కిలోలు కటింగ్ చేస్తేనే లారీలను అన్‌లోడ్ చేసుకుంటున్నారు.

– కమ్మదనం మల్లేష్‌గౌడ్, ఖానాపూర్

ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం



జడ్చర్ల: మండలంలోని ఆలూరులో ఆదివారం భారతీయ కిసాన్ మోర్చ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని, ఈ సందర్భంగా కిసాన్ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షులు బాలకృష్ణ పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్‌రెడ్డి, నిరంజన్, రాములు, తదితరులు పాల్గొన్నారు.

అండర్-23 ప్రాబబుల్స్ క్రీడాకారుల ఎంపిక

- ఈనెల 9, 10, 11 తేదీల్లో లీగ్ మ్యాచ్‌లు

మహబూబ్‌నగర్ క్రీడలు: ఇటీవల జరిగిన అండర్-23 ఇంట్రా డిస్ట్రిక్ట్ క్రికెట్ టూడే లీగ్‌లో రాణించిన 27 మంది క్రీడాకారులను పాబబుల్స్‌కు ఎంపిక చేసినట్లు ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ ఆదివారం వెల్లడించారు. వారికి ఈనెల 9 నుంచి 11 వరకు మహబూబ్‌నగర్‌లో మూడు లీగ్ మ్యాచ్‌లు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారిని రాబోయే హెచ్‌సీఏ టోర్నమెంట్‌లో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామని తెలిపారు. ప్రాబబుల్స్ క్రీడాకారులు లీగ్ మ్యాచుల్లో తమ వ్యక్తిగత క్రీడానైపుణ్యాన్ని చాటుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

క్రీడాకారుల వివరాలు

షాదాబ్, అబ్దుల్ రాఫె, కె.శ్రీకాంత్, అక్షయ్, శషాంక్, ముఖిత్, అభిలాష్ (మహబూబ్‌నగర్), ఛత్రపతి, రాహుల్, మణి, జైసింహ (గద్వాల), కేతేశ్వర్, చరణ్, రాంచరణ్, జస్వంత్, గగన్, రాఖి, చైతన్య కుమార్ (నాగర్‌కర్నూల్), ప్రతీష్, ఆర్యన్ (నారాయణపేట), మహేష్‌నాయక్ (వనపర్తి), సంజయ్, కేతన్, అక్షయ్, మణిచరణ్, హర్షిత్ (జడ్చర్ల).

నిత్యశుద్ధానందగిరి ఆరాధనోత్సవాలు



జడ్చర్ల టౌన్: మండలంలోని గంగాపురం మళయాళ స్వామి లక్ష్మీనారాయణ ఆశ్రమ వ్యవస్థాపకులు దివంగత నిత్యశుద్ధానందగిరి 4వ ఆరాధనోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు 4గంటలకు సుప్రభాతసేవతో ప్రారంభమై ప్రణవ పతాకావిష్కరణ, శివాలయంలో రుద్రాభిషేకం, హనుమాన్‌చాలీసా పారాయణం, అన్నదానం, సాయంత్రం వేదాంతజ్ఞానసభ, దీపాలంకరణ, పల్లకీ సేవలు నిర్వహించారు. రాత్రి పొద్దుపోయేదాకా భజనలు నిర్వహించారు. ఆశ్రమ పీఠాధిపతి పరమాత్మానందగిరి ఆధ్వర్యంలో జరుగుతున్న ఆరాధనోత్సవాల్లో పలు పీఠాల నుంచి పీఠాధిపతులు హాజరయ్యారు.

రాష్ట్ర ఎస్సీ గురుకుల కార్యదర్శిని తొలగించాలి

జడ్చర్ల టౌన్: ఎస్సీ గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులు ఎవరి టాయిలెట్లు వారే శుభ్రం చేసుకోవాలని వ్యాఖ్యానించిన ఎస్సీ గురుకులాల కార్యదర్శి అలుగు వర్షినిని పదవి నుంచి తొలగించాలని జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ కోడ్గల్ యాదయ్య ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

6న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రాక

- ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలో 132/33 సబ్ స్టేషన్‌తో పాటు అడ్డాకుల, మూసాపేట, భూత్పూర్ మండలాలకు మంజూరైన 8 33/11కేవీ సబ్ స్టేషన్లకు శంకుస్థాపన చేసే కార్యక్రమానికి ఈనెల 6న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మూసాపేటకు రానున్నట్లు దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మూసాపేట మండల కేంద్రంలో 132/33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం కోసం ఎంపిక చేసిన స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఉప ముఖ్యమంత్రి రాక కోసం ఏర్పాట్లను విద్యుత్‌శాఖ ఎస్ఈ పీవీ రమేష్‌తో ఎమ్మెల్యే చర్చించారు. పోల్కంపల్లి, అడ్డాకుల మండలంలోని రాచాల, గుడిబండ, ముత్యాలంపల్లి, భూత్పూర్ మండలంలోని తాటికొండ, అమిస్తాపూర్, మద్దిగట్ల గ్రామాలకు మంజూరైన 33/11కేవీ 8 విద్యుత్ సబ్ స్టేషన్లకు కూడా ఇక్కడే ఉప ముఖ్యమంత్రి భట్టి శంకుస్థాపన చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.



మూసాపేట వద్ద సబ్ స్టేషన్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

జంతువుల తరలింపులో అధికారిక సర్టిఫికెట్ తప్పనిసరి

మహబూబ్‌నగర్ క్రైం: గోవులను రవాణా చేయడానికి అధికారిక సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలని, లేకుండా తరలిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం బీఫ్ వ్యాపారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ బక్రీద్ పండుగ నేపథ్యంలో పశువుల రవాణా, కోతల విషయంలో చట్టాలు, నిబంధనలు ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ఒకే వాహనంలో అధిక సంఖ్యలో జంతువులను తరలించరాదన్నారు. కొత్త చట్టాల ప్రకారం ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ అప్పయ్య, ఎస్ఐ శీనయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

'పట్టుదలతో చదివితేనే విజయం'

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టుదలతో చదివితేనే విజయం వరిస్తుందని, అనుకున్న లక్ష్యానికి చేరువవుతారని ఉస్మానియా జనరల్ హాస్పిటల్ ప్రొఫెసర్ డా.కెంచె జీవన్ అన్నారు. ఈ ఏడాది 'పది' లో అత్యధిక మార్కులు సాధించిన 26 మంది, ఇంటర్మీడియేట్‌లో ఉత్తీర్ణులైన 14మంది ఉత్తమ విద్యార్థులకు ఆదివారం స్థానిక తువ్వగుట్టలోని బసవ భవనంలో వీరశైవ లింగాయత్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన వక్త బల్లె రాజేశ్వర్, సంఘం జిల్లా అధ్యక్షుడు కొడుగంటి మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శి జి.రవీందర్, కోశాధికారి కె.నాగరాజు, సభ్యులు ఉమాదేవి, రవీందర్ పాల్గొన్నారు.



ప్రతిభా పురస్కారాలతో విద్యార్థులు, నాయకులు

స్నేహితుల కుటుంబాలకు ఆర్థికసాయం

చిన్నచింతకుంట: పదో తరగతి వరకు కలిసి చదివిన స్నేహితుడు అనారోగ్యంతో మృతి చెందాడు. తోటి స్నేహితులు బా ధిత కుటుంబానికి రూ.2.16 లక్షల ఆర్థిక సాయం చేసి అండగా నిలిచారు. కొకుంట్ల మండలం అప్పంపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీకాంత్‌రెడ్డి వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. 1992–93 పదో తరగతి మిత్రులు స్నేహితుని కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్నేహితులు బోట్లం శ్రీను, రవిందర్‌గౌడ్, మదన్‌మోహన్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, కోకల హరీష్, నరేందర్‌గౌడ్, జగదీశ్వర్‌రెడ్డి, నరసింహారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, గంగిరెడ్డి ఉన్నారు.

స్నేహితురాలికి అండగా..

దేవరకద్ర రూరల్: అనారోగ్యంతో భర్త మృతి చెంది, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న తమ స్నేహితురాలికి పేరూర్‌లోని ఉన్నత పాఠశాలలో 1994–95లో పదో తరగతి పూర్వ విద్యార్థులు రూ.50 వేలను పోగుచేసి ఆమె ఇంటికి వెళ్లి నగదు అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామన్నారు.



లక్ష్మీకాంత్‌రెడ్డి కుటుంబానికి ఆర్థిక సాయం చేసిన పూర్వవిద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

జడ్చర్ల టౌన్: పట్టణంలోని బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 1993–96 బీఎస్సీ పూర్వ విద్యార్థులు 40మంది కళాశాలలో సమావేశమయ్యారు. అనంతరం కళాశాల అభివృద్ధి గూర్చి బొటానికల్ గార్డెన్ సమన్వయకర్త డా.సదాశివయ్యను అడిగి తెలుసుకున్నారు. గార్డెన్‌లో రూ.2 లక్షల నెట్‌హౌస్ తాము స్పాన్సర్ చేస్తామని ముందుకొచ్చారు. నెట్‌హౌజ్ నిర్మాణానికి అప్పటికప్పుడు టెంకాయలు కొట్టి భూమి పూజ చేశారు. గార్డెన్‌లో మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా.సుకన్య అభినందించారు.

'కేజీబీవీ కార్మికుల సర్వీసును క్రమబద్ధీకరించాలి'

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కేజీబీవీలలో పనిచేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి సర్వీసును క్రమబద్ధీకరించాలని తెలంగాణ ప్రగతిశీల బోధనేతర ఉద్యోగులు, కార్మికుల సంఘం (టీయూఏ అనుబంధం) రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ వసతి గృహాల్లో కార్మికులకు ఇచ్చే వేతనం రూ.9,750తో కుటుంబం ఎలా బతకాలని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం పద్ధతిలో పెంచాలన్నారు. విద్యార్థుల సంఖ్యకనుగుణంగా కార్మికులను పెంచాలన్నారు.

కరాటే మార్షల్ ఆర్ట్స్‌లో ప్రతిభ చాటాలి

- డీఎస్పీ వెంకటేశ్వర్లు

మహబూబ్‌నగర్ క్రీడలు: విద్యార్థులు కరాటే మార్షల్ ఆర్ట్స్‌లో ప్రతిభ చాటాలని డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. కింగ్‌షోటోకాన్ ఫౌండర్ జహంగీర్ పాషా ఖాద్రీ ఆధ్వర్యంలో ఈ ఏడాది జిల్లా కేంద్రంలో 27వ వేసవి ఉచిత కరాటే శిక్షణా శిబిరాలు నిర్వహించారు. స్థానిక షాషాబ్‌గుట్టలోని అల్‌నూర్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన వేసవి కరాటే శిక్షణ ముగింపు కార్యక్రమంలో డీఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 27 ఏళ్ల నుంచి వేసవి ఉచిత కరాటే శిక్షణా శిబిరాలు నిర్వహిస్తుండడం అభినందనీయమని అన్నారు. ఆత్మరక్షణ కోసం కరాటే మార్షల్ ఆర్ట్స్ శిక్షణ తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా బాలికలు కరాటే నేర్చుకోవాలన్నారు. టూటౌన్ సీఐ ఎజాజుద్దీన్ మాట్లాడుతూ జహంగీర్ పాషా ఖాద్రీ గత కొన్నేళ్ల నుంచి విద్యార్థులకు కరాటే శిక్షణ ఇస్తుండడం అభినందనీయమని అన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కింగ్‌షోటోకాన్ ఫౌండర్ జహంగీర్‌పాషా ఖాద్రీ, వైస్ చైర్మన్ చెన్న వీరయ్య, సయ్యద్ తఖియొద్దీన్, ఖాజాపాషా, యోగా కోచ్ బాలమణి, ఆర్ట్ జమీల్, అమాన్‌ఖాన్, తుపుడ మహేష్, బాలే షరీఫ్, మారియబేగం, సాయి ప్రణీత్, సూఫియాన్‌అలీ, ఖిజ్రా పాల్గొన్నారు.



సర్టిఫికెట్ అందిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

ఉత్సాహంగా కరాటే బ్లాక్‌బెల్టు గ్రేడింగ్ పరీక్షలు

మహబూబ్‌నగర్ క్రీడలు: కరాటే మార్షల్ ఆర్ట్స్‌తో దేహదారుఢ్యంతో పాటు మానసికంగా ఎదగవచ్చని జీకే మాస్టర్ షోటోకాన్ ఫౌండర్ చీఫ్ జి.కృష్ణయ్య అన్నారు. అప్పన్నపల్లిలోని కమ్యూనిటీహాల్‌లో జీకే మాస్టర్ షోటోకాన్ పట్టణ ఉపాధ్యక్షులు, సీనియర్ కరాటే మాస్టర్ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో కరాటే బ్లాక్‌బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కృష్ణయ్య మాట్లాడుతూ ప్రస్తుతం కరాటే మార్షల్ ఆర్ట్స్‌కు ఎంతో ప్రాధాన్యత ఏర్పడిందన్నారు. స్వీయరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలని కోరారు. గత కొన్నేళ్ల నుంచి జీకే షోటోకాన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మెరుగైన కరాటే శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. మాస్టర్ నవీన్‌కుమార్ మాట్లాడుతూ కరాటే బెల్టు గ్రేడింగ్ పరీక్షలో వైట్ టూ ఎల్లో7, ఎల్లో టూ ఆరెంజ్ 4, ఆరెంజ్ టూ బ్లూ 8, బ్లూ టూ మెరూన్ 1, మెరూన్ టూ బ్లూ 1, బ్రౌన్ థర్డ్‌లో 2, బ్రౌన్ సెకండ్‌లో 2, బ్రౌన్ 1 బెల్టులు సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ కరాటే మాస్టర్లు నవీన్‌కుమార్, సత్యనారాయణ, బ్లాక్‌బెల్టు విద్యార్థులు భూపేష్, నవతేజ, సోనల్, వి.సాయి వర్షిణి, అభినవ్, అక్షర, భవ్యశ్రీ, వరుణ్, ప్రకాశ్, ఆద్య, తదితరులు పాల్గొన్నారు.



బ్లాక్‌బెల్టులు పొందిన విద్యార్థులతో జి.కృష్ణయ్య, ఇతర మాస్టర్లు

నేడు తెలంగాణ అవతరణ దినోత్సవం

దేవరకద్ర: దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సోమవారం తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగే పతాకావిష్కరణకు మండల నాయకులు అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని తహసీల్దార్ కృష్ణయ్య ఒక ప్రకటనలో కోరారు.

3 నుంచి భూ భారతి రెవెన్యూ సదస్సులు

భూత్పూర్: మండలంలోని వివిధ గ్రామాల్లో 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఎస్.కిషన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్ రెండు టీంలు ఏర్పాటు చేసి 8 గ్రామ పంచాయతీల చొప్పున కేటాయించినట్లు తహసీల్దార్ వివరించారు. 3న గోప్లాపూర్, అన్నాసాగర్, 4న కర్వెన, తాటికొండ, 5న మద్దిగట్ల, హస్నాపూర్, 6న ఎల్కిచర్ల, పోతులమడుగు, 9న కొత్తూర్, రావులపల్లి, 10న తాటిపర్తి, కొత్త మొల్గర, 11న పాతమొల్గర, అమిస్తాపూర్, 12న కప్పెట, భూత్పూర్ గ్రామాల్లో భూ భారతి సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కె.కిషన్ తెలిపారు.

గండేడ్: ఈనెల మూడు నుంచి భూ భారతి గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మల్లికార్జున్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. 3న రెడ్డిపల్లి, కప్లాపూర్, 4న బల్లుర్‌గొండ, బోయిన్‌పల్లి, 5న సాలార్‌నగర్, 6న వెన్నచేడ్, సల్కర్‌పేట్, గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 9న పగిడ్యాల్, వరహగిర్‌పల్లి, 10న మన్సూర్‌పల్లి, రుసుంపల్లి, 11న గండీడ్, చెలిమిల్ల, 12న కొంరెడ్డిపల్లి, బైసుపల్లి, 13న పెద్ద వార్వాల్, జిన్నారం, 16 చిన్నావార్వాల్ గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభల్లో భూ సమస్యలకు సంబంధించి అర్జీలు పెట్టుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

అనుమానితులను పోలీసులకు అప్పగింత

అడ్డాకుల: మండలంలోని కందూర్ సమీపంలో రాత్రివేళ అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురిని గొర్రెల కాపరులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. స్థానికుల వివరాల ప్రకారం.. కందూర్ సమీపంలోని క్రషర్ వద్ద శనివారం రాత్రి కొందరు కాపరులు తమ గొర్రెల మందలను నిలిపారు. అర్ధరాత్రి సమయంలో ఖిల్లాఘనపురం మండలం మామిడిమాడకు చెందిన ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో కాపరులు గుర్తించి వారిని పట్టుకున్నారు. గ్రామంలోకి తీసుకెళ్లి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు వచ్చి వారిని ఠాణాకు తరలించారు. ఆదివారం ఉదయం ముగ్గురిని పోలీసులు విచారించినట్లు తెలిసింది. దీనిపై ఎస్ఐ ఎం.శ్రీనివాస్‌ను వివరణ కోరగా అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురిని గ్రామస్తులు తమకు అప్పగించగా, వారిని విచారించినట్లు తెలిపారు. దొంగతనానికి ప్రయత్నం చేసినట్లు తేలకపోయినందున ముగ్గురిని తహసీల్దార్ ముందు బైండోవర్ చేస్తామని పేర్కొన్నారు. 25 రోజుల కిందట కందూర్ గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో స్వామి వారి వెండి ముఖం ఆభరణాన్ని గుర్తుతెలియని దొంగలు ఎత్తుకెళ్లారు. దీంతో పాటు ఇటీవల గ్రామానికి సమీపంలో నిలుపుకున్న 60 గొర్రెల్లో 20 గొర్రెలను దొంగలు ఎత్తుకెళ్లారు. ఈ క్రమంలో జరిగిన సంఘటన కావడంతో కొంత కలకలం రేపింది.

టీజీఎంఎఫ్‌సీ చైర్మన్ కొత్వాల్ జన్మదిన వేడుకలు



స్టేషన్ మహబూబ్‌నగర్: టీపీసీసీ ఉపాధ్యక్షులు, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ జన్మదిన వేడుకలు ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో నిర్వహించారు. కొత్వాల్‌ను పలువురు నాయకులు పూలబొకేలు అందజేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. పలువురు మాట్లాడుతూ కొత్వాల్ ఎన్ఎస్‌యూఐ నుంచి విద్యార్థి నాయకుడిగా ఎదిగి ఉమ్మడి జిల్లాలో సీనియర్ కాంగ్రెస్ నేతగా ఉంటూ పార్టీ పటిష్టత కోసం పనిచేస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడితో పాటు పలు పార్టీ పదవుల్లో కొనసాగినట్లు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కొత్వాల్ భవిష్యత్‌లో మరెన్నో పదవులు అదిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్, డీసీసీ మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్, నాయకులు లింగం నాయక్, అజ్మత్ అలీ, అవేజ్, అక్బర్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులు కోర్టుల చుట్టూ తిరుగుతుంటే సంబరాలా?

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): తెలంగాణ ఉద్యమంలో సకల జనుల సమ్మె సమయంలో 28 మంది ఉద్యోగ ఉద్యమకారులపై పెట్టిన కేసుల విషయంలో ఇప్పటికీ ఆ ఉద్యమకారులు కోర్టుల చుట్టు తిరుగుతుంటే 12వ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భవ వేడుకలను జరుపుకుంటున్నామని టీఎన్‌జీఓ జిల్లా కార్యదర్శి చంద్రనాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 28 మంది మహబూబ్‌నగర్ కోర్టుకు తిరుగుతుంటే ఈ రాష్ట్ర ప్రభుత్వం పెద్దలు ఏమాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఆనాడు నాతో పాటు ఉద్యమంలో పాల్గొన్న మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా కొల్లాపూర్ ఎమ్మెల్యే ప్రస్తుత మంత్రి జూపల్లి కృష్ణారావు ఏమాత్రం పట్టించుకోవడం లేదని, ఎన్ని సార్లు కలిసేందుకు ప్రయత్నించినా తమను కలువ లేదని ఆరోపించారు. 12వ రాష్ట్ర అవతరణ వేడుకల్లో జిల్లా కేంద్రంలో జెండా ఆవిష్కరణకు వస్తున్న మంత్రి ఇప్పటికైనా తెలంగాణ ఉద్యమకారులను పట్టించుకోవాలని కోరారు. తమపై ఉన్న ఉద్యమ కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ అమరవీరుల కుటుంబాలు, వివిధ కేసుల్లో కోర్టు చుట్టు తిరుతున్న తెలంగాణ ఉద్యమకారులతో మంత్రి సమావేశం పెట్టి తమ బాధలు వినాలని కోరారు.

పేదలకు ఇందిరమ్మ ఇళ్లు వరం



గండేడ్: గూడు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు వరమని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్లారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జితేందర్ రెడ్డి తెలిపారు. ఆదివారం గండేడ్ మండల పరిధిలోని గండేడ్, అంచపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ బాలయ్య, సుదర్శన్‌రావు, చెన్నారెడ్డి, వెంకటేశ్, భగవంత్‌రెడ్డి, వెంకన్నగౌడ్, పాల్గొన్నారు.